ప్రకృతి సోయగం.. సప్త గుండాల


భీమ గుండం


రామ గుండం

ప్రకృతి సోయగాల మధ్య మిట్టే జలపాతం పర్యాటకులను కనువిందు చేస్తోంది. లింగాపూర్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏడు జలపాతాలను కలిపి మిట్టే జలపాతంగా పిలుస్తారు. సప్తగుండాలుగా పిలిచే రామ గుండం, లక్ష్మణ గుండం, సీత గుండం, భీమ గుండం, సవితి గుండం, చిరుతల గుండం, సప్త గుండం అనే జలపాతాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. జిల్లా కేంద్రానికి 90కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతాల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – లింగాపూర్


లక్ష్మణ గుండం

క్లుప్తంగా

దేశీదారు మద్యం పట్టివేత


పట్టుకున్న దేశీదారు బాటిళ్లు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో అహల్యనగరి ఎక్స్‌ప్రెస్ రైలులో మంగళవారం సోదాలు నిర్వహించి దేశీదారు మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన 175 దేశీదారు 90 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సోదాల్లో రైల్వే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

వంజారిగూడలో వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుంకన్న

లింగాపూర్: మండలంలోని వంజారిగూడలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది రోగులకు వైద్యుడు సుంకన్నతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యుడు గ్రామస్తులకు వివరించారు. సూపర్‌వైజర్ ఇంద్రావతి, హెచ్‌ఈవో దత్తారాం, సునీల్, సూర్యకళ పాల్గొన్నారు.

'బాధిత కుటుంబానికి అండగా ఉంటాం'


ఆర్థికసాయం అందజేస్తున్న సుధాకర్‌రావు

పెంచికల్‌పేట్: బొంబాయిగూడ గ్రామానికి చెందిన గోగు అంకుబాయికి చెందిన ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షానికి కూలిపోగా బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు మంగళవారం పరామర్శించి రూ.2వేలు నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయన వెంట చప్పిడే ప్రకాశ్, గుండయ్య, నగేష్, మధుకర్, సత్యనారాయణ, ప్రభాకర్, శంకర్, కాంతారావు, ప్రభాకర్, కమలాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

జైనూర్: గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిప్యూటీ డైరెక్టర్ రమాదేవికి మంగళవారం వినతిపత్రం అందించారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తొడసం శ్రీనివాస్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు కృష్ణ, వినోద్, సురేశ్, విజేందర్, జనార్దన్, తదితరులు ఉన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీఎంఎస్ జెండా ఎగురవేశారు. బీఎంఎస్ జిల్లా సంఘటన కార్యదర్శి అన్నం రాజన్న, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడుతూ 'దేశం కోసం పని చేస్తాం, తగిన వేతనం సాధిస్తాం' అనే నినాదం బీఎంఎస్ సొంతమన్నారు. ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎంకే ప్రసాద్, పెంటు, జాన్ ప్రకాశ్, సుదర్శన్, నానయ్య, రాంకుమార్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

26న విడిభాగాల వేలం

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీసుశాఖలో వినియోగించిన వాహనాల విడిభాగాలు స్క్రాప్ టైర్లు, ఇంజిన్ ఆయిల్, బ్యాటరీలను ఈ నెల 26న వేలం వేయనున్నట్లు ఆర్ఐ ఎంటీవో అంజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 87126 70517 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

• కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలు, ఏపీఏలకు ఆగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక రోజు శిక్షణా శిబిరంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ రమేష్, డైరెక్టర్ ఆఫ్ సస్టైనబుల్ ఎన్విరాన్‌మెంట్ ప్రమోద్ డబ్రాసేలతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంతో పాటు వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నియంత్రణ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామీణస్థాయి నుంచి అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రతిరోజూ గడపగడప నుంచి తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, డంపింగ్ యార్డుకు తరలించనున్నట్లు తెలిపారు. వీటిలో ఉపయోగపడే వాటిని వేరు చేసి కంపోస్టు షెడ్ల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కంపోస్టు ఎరువు ఉపయోగంపై సంబంధిత అధికారులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీటీసీ సుభాష్, నజీర్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రెబ్బెన: దొంగతనాలు, నేరాల నియంత్రణ కోసం మండలంలోని వ్యాపార సంస్థల, పెట్రోల్‌బంకులు, నగల దుకాణదారులు, మద్యం షాపుల నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్‌లు సూచించారు. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో వ్యాపార సంస్థల నిర్వాహకులతో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాలతో దొంగతనాలు జరగకుండా అరికట్టడంతో పాటు దొంగతనం జరిగితే చోరీకి పాల్పడిన వారిని త్వరగా గుర్తించవచ్చన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిత్యం పరిశీలిస్తూ ఉండాలని, పని చేయని సీసీకెమెరాలకు మరమ్మతులు చేయించాలని సూచించారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి


బెజ్జూర్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


రెబ్బెనలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గట్టు తిరుపతి గౌడ్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నాయకులతో కలిసి మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వెంకటేష్, బీజేపీ నాయకులు దిగంబర్, బాలకృష్ణ, బిక్షపతి గౌడ్, రాకేశ్, రాజారాం, మోహన్, సంతోష్, శ్యాంసుందర్, రమేశ్, బషీర్‌ఖాన్, తిరుపతి తదితరులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని బీసీలకు వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేసి న్యాయం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ అన్నారు. బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి జగన్నాథ ఓదెలు, మండల ఉపాధ్యక్షుడు మండల మధూకర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పులేటి మల్లేశ్, సచిన్ జైస్వాల్‌లు పాల్గొన్నారు.

కేస్లాపూర్ ఆలయ ప్రాంగణంలో వన మహోత్సవం


మొక్క నాటుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ భవిష్యత్తు తరాల వారు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పిన్నా వివేక్, రూప్‌నార్ రమేశ్, ఉదయ్, నారాయణమూర్తి, లక్ష్మణమూర్తి, రాధాకృష్ణచారి, విజయ్‌కుమార్ శర్మ, భూషణం, సుధాకర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎక్స్‌పో ట్రేడ్‌షో' విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే ఫొటోగ్రాఫర్ల ఎక్స్‌పో ట్రేడ్‌షోను విజయవంతం చేయాలని ఫొటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. మంగళవారం ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని లక్ష్మి ల్యాబ్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలో భాగంగా కొత్త ఒరవడికి నాంది పలుకుతూ పలు రకాల టెక్నీషియన్లు, కెమెరాలు ప్రదర్శనలో పెడతారని, ఫొటో, వీడియో గ్రాఫర్లకు కావాల్సిన అన్నిరకాల పరికరాలు లభ్యమవుతాయని పేర్కొన్నారు.

కౌటాల: ఫొటోగ్రాఫర్ల ఎక్స్‌పో ట్రేడ్ షోను ఫొటోగ్రాఫర్లు విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎక్స్‌పో ట్రేడ్‌షో పోస్టర్‌ను ఫొటోగ్రాఫర్లు విడుదల చేశారు. జీవన్, సతీశ్, నగేశ్, శంకర్, నాందేవ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సులో శిక్షణ పొందిన వారికి పరీక్షలు


పరీక్షలకు హాజరైన మహిళలు

రెబ్బెన: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తివిద్య కోర్సులో శిక్షణ పొందిన అభ్యర్థులకు మంగళవారం గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రీజినల్ ఆఫీసర్ అనసూయ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం ఉపాధి వృత్తి విద్యను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృత్తి శిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని తద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ద్వారా నాలుగు వృత్తి శిక్షణ కోర్సుల్లో మాదారంలో 37 మంది, గోలేటిలో 44 మంది శిక్షణ పొందిన మహిళలు పరీక్షలకు హాజరయ్యారు. కార్యక్రమంలో సేవా సమితి చీఫ్ కోఆర్డినేటర్ శివకుమార్, కేజీఎంవీ అధికారి నరేశ్, సీనియర్ పీవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎం క్రీడామైదానంలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. మంగళవారం మిల్లు ఉపాధ్యక్షుడికి రాసిన లేఖలో వారు కోరారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో యువకుల నుంచి సీనియర్ సిటిజన్ల వరకు వాకింగ్ చేసేందుకు ఎంతో అనువుగా ఉందని, ఈ క్రీడామైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే మరింత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు ఎం.సుభాష్, గోపిరెడ్డి, ఆనంద్‌కుమార్, జగన్మోహన్, బోర్కుటె రాం, మధుకర్, రమేశ్, నారాయణ, రాంకుమార్, నర్సింహులు, నాగేందర్, మానిక్యం పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో కార్పొరేట్లకు నిధులు'

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు మాటలు, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు, నిధులు సమకూర్చే విధానాలను ప్రకటించారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన హామీ అమలు గురించి ఎలాంటి సమీక్ష లేకుండానే బడ్జెట్‌లో నాలుగు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మొత్తంగా గతం కంటే బడ్జెట్ 10 శాతం పెంచి చూపించారే తప్పా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

ఫీల్డ్ కిట్ల పంపిణీ


కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్‌లోని బేస్ క్యాంపు వాచర్లు, ట్రాకర్లకు ఎస్పీఎం మిల్లు ఆధ్వర్యంలో కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ కింద ఫీల్డ్ కిట్లను పంపిణీ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎఫ్‌డీవో కార్యాలయంలో కిట్లను అందజేశారు. వాచర్ల, ట్రాక్లర్లకు ఫీల్డ్ కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమని ఎఫ్‌డీపీటీ శాంతారాం అన్నారు. కార్యక్రమంలో మిల్లు రా మెటీరియల్ ప్లాంటేషన్ మేనేజర్ సంతోశ్ దీపాలే, సీఎస్ఆర్ ఎస్పీఎం యూనిట్ మేనేజర్ రీనా బిల్వాల్, డీఎఫ్‌వో టోబ్రియాల్, ఎఫ్‌డీవో అప్పలకొండ, ఎఫ్‌ఆర్‌వో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన జలపతిరావు కుటుంబానికి జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం తన కార్యాలయంలో రూ. 8లక్షల చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, ఏవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అసభ్యకర వీడియోలు పెడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ఆసిఫాబాద్‌అర్బన్: సెల్‌ఫోన్ దొంగతనం చేసి అసభ్యకరమైన వీడియోలు, ఫొటోలు పెడుతూ కాగజ్‌నగర్ పట్టణం ఈజ్‌గాంకు చెందిన మహిళను మానసిక క్షోభకు గురి చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కేశవ్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం బాధిత మహిళకు న్యాయం చేయాలని జిల్లా కేంద్రంలో ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకోవాలని, కేసులు నమోదు చేసి శిక్షించాలని కాగజ్‌నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నేటి వరకు దొంగను గుర్తించలేదన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో సుశీల, యశోద, శ్రావణ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పెన్షన్‌ల పెంపు వెంటనే అమలు చేయాలి


మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన: కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు హామీ ఇచ్చిన పెన్షన్ పెంపును వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం గోలేటి పోస్టాఫీస్ వద్ద పెన్షన్ డబ్బుల కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు, దివ్యాంగులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్‌ను 100 రోజుల్లో అందచేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు పెంచలేదన్నారు. కాగా పెన్షన్‌లను పోస్టాఫీసుల వద్ద అందిస్తుండటంతో పూర్తిస్థాయిలో పెన్షన్ డబ్బులు చెల్లించకుండా మోసం చేస్తున్నారని, లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా బ్యాంకు ద్వారా పెన్షన్‌లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులు రాజయ్య, సాయగౌడ్, పుల్లయ్య, కిషన్‌నాయక్, రాజయ్య, శంకర్, రుక్మిణి, మెంగు, తారాచంద్, పాండు తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కౌటాల: రైతులు పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ అన్నారు. మంగళవారం కౌటాల రైతువేదిక భవనంలో రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు వీక్షించారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట సాగులో చేపట్టాల్సిన పద్ధతులు వివరించారు. భారీ వర్షాలు కురుస్తున్నాయని, రైతులు వరి పంట సాగు చేయాలన్నారు. మిర్చి, మొక్కజొన్న పంటల సాగుకు ఆగస్టు నెల అనువైందన్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులు పత్తి పంటల్లో కలుపు తీయడం, ఎరువులు వేయడం, చేనుల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంట లకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఏఈవోలు అంజన్న, ఘన్‌శ్యాం, రవి, శ్రీకన్య, భవాని, కల్పన, రేష్మిత పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలు


మాట్లాడుతున్న సురేందర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీని మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన డీఆర్డీవో సురేందర్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, కార్యాలయ అధికారి కృష్ణమూర్తి, ఇతర అధికారులు నిర్వహించారు. ఆసిఫాబాద్ మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. వారు మాట్లాడుతూ తొమ్మిది గ్రామ పంచాయతీల తనిఖీ పూర్తి కాగా వివిధ పనులకు సంబంధించి రూ.32,600 పెనాల్టీ విధించడంతో పాటు రూ.1,26,200 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. నాలుగు పనులను నాణ్యత ప్రమాణాల విభాగానికి బదిలీ చేయడంతో పాటు 16 మందికి వివిధ పనులకు సంబంధించి షోకాజు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. ఇంకా 18 జీపీలు మిగిలి ఉండడంతో పెద్దఎత్తున అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.